విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 31, మే 2025

రేషన్ బియ్యం పక్కదారి పడితే చర్యలు తప్పవు

విశాలాంధ్ర – నందికొట్కూరు: రేషన్ బియ్యం పక్క దారి పడితే చర్యలు తప్పవని రేషన్ నందికొట్కూరు పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ నుండి రేషన్ డీలర్లకు తరలిస్తున్న బియ్యం బస్తాలలో తక్కువగా వస్తున్నాయంటూ ఫిర్యాదులు అందాయని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పోరేషన్ డైరెక్టర్లు తలముడిపి మహేష్ నాయుడు, కొంకతి లక్ష్మినారాయణలు తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ దీని వల్ల నిర్వీర్యం చేస్తే ఎవరైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. శుక్రవారం నంది కొట్కూరు మార్కెట్ యార్డులో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్ ను రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పోరేషన్ డైరెక్టర్లు మహేష్ నాయుడు, లక్ష్మినారాయణలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో ప్రజాపంపిణీ వ్యవస్థకు సంబంధించిన పలు రికార్డులు తనిఖీ చేశారు. గోదాములో బియ్యం బస్తాలు పరిశీలించారు. బియ్యం బస్తాలు తూకం కాటా వేయించారు. గోదాములో నిల్వ ఉంచిన బియ్యం బస్తాలు 4 తూకం వేయించారు. అందులో ఒక్కో బస్తా లో 43.5 కేజీలు, 44 కేజీలు, 44.5 కేజీలు ఉండగా జిల్లా గోదాము నుండి 49.5 కేజీలు లేదా 50.5 కేజీలు ఉండాలని అయితే ఎందుకు బస్తాలో బియ్యం తక్కువగా ఉన్నాయని ఆరా తీశారు. డీలర్లకు బియ్యం బస్తాలో తూకం తక్కువగా ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అనంతరం పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన బియ్యం బస్తాలు 984 కాగా వీటన్నింటినీ ఇప్పటికే రేషన్ డీలర్లకు తరలించినట్లు డైరెక్టర్లకు గోదాము ఇంచార్జ్ నారాయనమ్మ తెలిపారు. సీజ్ చేసిన బియ్యం బస్తాలు డీలర్లకు ఎవరి అనుమతితో తరలించారని ప్రశ్నించారు. 110 బస్తాలు ఐచర్ వాహనంలో తరలిస్తుండగా వాటిని సివిల్ సప్లయ్ కార్పోరేషన్ డైరెక్టర్లు నిలిపివేశారు. ఎక్కడికి తరలిస్తున్నారని ఆరా తీశారు. ప్రభుత్వం నుండి అందజేసే గోనె సంచుల్లో కాకుండా పాలిథిన్ సంచుల్లో ఏ విధంగా డీలర్లకు పంపిస్తున్నారని, డీలర్లు లేకుండా ఎలా పంపిస్తారని ప్రశ్నించారు. పోలీస్ అధికారులు సీజ్ చేసిన బియ్యం బస్తాలు 984లో 110 ఉన్నాయని మిగిలిన వాటికి లెక్క చెప్పాలని పేర్కొన్నారు. వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నాదెండ్ల మనోహర్‌లు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థకు పటిష్ట చర్యలు చేపడుతున్నారన్నారు.

ఇళ్ల స్థలాలు దక్కేంతవరకు ఉద్యమాలు ఆగవు

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : అర్హులైన నిరుపేదలు ఇచ్చిన అర్జీలను సత్వరమే పరిశీలించి ఇళ్ల స్థలాలు కేటాయించి ఇల్లు నిర్మించేందుకు రూ.5 లక్షలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు జూన్ 2న జిల్లా లోని అన్ని మండలాల్లో గతంలో ఇచ్చిన అర్జీదారులతో మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట జరుగు ధర్నా లను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యాల యం నందు జూన్ 2వ తేదీ మండల కార్యాలయాల ఎదుట జరుగు ధర్నా వాల్ పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా ఎన్.రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబాఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు. పి సుంకయ్య, మోటా రాముడు, పట్టణ కార్యదర్శి కే.ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు సంజీవులు, ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షు రాలు లక్ష్మీదేవి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సోమన్న, ఏఐటియుసి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు భూమని శ్రీనివాసులు, డి.శ్రీనివాసులు, గోస్పాడు మండల కార్యదర్శి జి.హరినాథ్, సహాయ కార్యదర్శి జిలాని బాషలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగనాయుడు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వ భూములను గుర్తించి ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలాలు కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో భూ పోరాటాలు నిర్వహించి ప్రతి పేదవాడికి నివాస స్థలం ఏర్పాటు చేస్తామని, జిల్లా వ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం ఇచ్చిన అర్జీలను పరిశీలించి ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ధర్నాను జయప్రదం చేయండి : సీపీఐ

విశాలాంధ్ర – నందికొట్కూరు : ఇల్లులేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని కోరుతూ జూన్ 2వ తారీఖున సిపిఐ ఆధ్వర్యంలో జరుగు ధర్నాలో లబ్దిదారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సిపిఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రజిత పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మారుతినగర్, హాజీనగర్ కాలనీల లబ్ధిదారులతో కలిసి ధర్నాకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేకమంది ఇల్లులేని పేద ప్రజలు ఉన్నారని పేద ప్రజల తరపున సిపిఐ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. సుబ్బన్న, సుంకన్న,అబ్దుల్ ముజీఫ్, మహేష్, రఘు, బాలగ్రం, లక్ష్మీదేవమ్మ, షేకున్ బీ, కుమారి, ఏమేలమ్మ, రోజమ్మ వెంకటేశ్వరమ్మ, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు, యూనిఫారం పంపిణీకి సిద్ధం

విశాలాంధ్ర – రుద్రవరం: మండల పరిధిలోని 56 పాఠశాలల్లో విద్యన భ్యసిస్తున్న విద్యార్థులకు నోటు పుస్తకాలతో పాటు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ లను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని ఎంఈఓ లక్ష్మి తెలిపారు. శుక్రవారం విద్యార్థులకు పంపిణీకి సిద్ధంగా ఉన్న పాఠ్యపుస్తకాలు యూనిఫామ్ స్టాకును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక, మోడల్ పాఠశాల, కస్తూరిబా గురుకుల పాఠశాలలు మొత్తం 56 ఉన్నాయన్నారు. ఇందులో బాలురు 2169, బాలికలు 2406, మొత్తం 4575 విద్యార్థులు ఉన్నారన్నారు. వీరందరికీ జూన్ 12న పాఠశాలలు ప్రారంభం నాటికి పాఠ్యపుస్తకాలను, యూనిఫామ్ దుస్తులను, పంపిణీ చేసేందుకు సిద్ధం చేశామన్నారు. ఆమె వెంట సిఆర్‌పిలో రామయ్య, శ్రీనివాసులు, ఎంఆర్‌సి సిబ్బంది ఉన్నారు.

యోగాసనాలు ఆరోగ్యానికి మేలు

విశాలాంధ్ర – జూపాడుబంగ్లా: ప్రజల ఆరోగ్య పరిరక్షణకై యోగాస నాలు చేస్తున్నట్లు ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. శుక్రవారం ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాలలో మండలంలోని వివిధ శాఖల ఉద్యో గులచే యోగాసనాలు చేయించారు. జూన్ 21వ తేదీన జరిగే జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయ వంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులకు శిక్షణ ఇస్తున్నామని ఆయన అన్నారు. ట్రైనర్స్ రేపల్లె ప్రభావతి, అనూష, గీత, బీసమ్మ, రాజ్ కుమార్‌లు వివిధ శాఖల అధికారులకు యోగాసనాలు చేయిం చారు. పలు ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ కార్యాలయంలో మాయమైన డాక్యుమెంట్ పత్రాలు

విశాలాంధ్ర – బనగానపల్లె: పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఇటీవల జరిగిన ఓ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన డాక్యుమెంట్ పత్రాలు మాయం అయ్యాయి. ఇది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఇంటి కొరకు రిజిస్టర్ చేసుకున్నాడు. ఆ తరువాత సంబంధిత పత్రాలను ఇవ్వాలని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అడగగా డాక్యుమెంట్ కాగితాలు కనిపించడం లేదని, కొంత సమయం ఇవ్వవలసిందిగా అడిగినట్లు మండల వ్యాప్తంగా జోరుగా ప్రచారం జరుగుతుంది. ఈ విషయాన్ని సబ్ రిజిస్టరర్ గోప్యంగా ఉంచడం పట్ల పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఎంతో విలువైన డాక్యుమెంట్ కాగితాలు కార్యాలయం సిబ్బంది నిర్లక్ష్యం వల్ల కనిపించకుండా పోవడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలిసిన విలేకరులు డాక్యుమెంట్ మిస్సింగ్‌పై సబ్ రిజిస్టర్ విజయ్ కుమార్‌ను వివరణ కోరగా.. డాక్యుమెంట్ కాగితాలు మిస్ కావడం జరిగిందని, జిల్లా అధికారికి తెలియపరిచిన తర్వాత ఒకటో తేదీన దీనిపై వివరాలు పూర్తిగా తెలియపరుస్తానన్నారు.

రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి



విశాలాంధ్ర – జూపాడు బంగ్లా: రైతులు ఖరీఫ్ సీజన్లో శాస్త్రవేత్తల సలహాలు పాటించాలని ఐసిఆర్ శాస్త్రవేత్త సూరన్న, కెవికె శాస్త్రవేత్త శ్రీనివాస్, ఏడిఏ బాలరాజులు సూచించారు. శుక్రవారం మండలంలోని తర్తూరు, మద్దెం, తంగడంచ గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా శాస్త్రీయ సలహాలు పాటించి పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవాలని వారన్నారు. భూసారా ఆధారిత ఎరువుల యాజమాన్యం, ప్రస్తుతం పంటల్లో వేయాల్సిన ఎరువుల మొతాదును వివరించారు. మొక్కజొన్న, కంది, వర్రీ సోయాబీన్, పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో కృష్ణారెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేతకాకనే నిందలు : మాజీ మంత్రి

విశాలాంధ్ర – డోన్ రూరల్: పక్కింటి పిల్లవాణ్ణి తన కొడుకు అంటూ ముద్దాడినట్టుగా టిడిపి వైఖరి ఉందని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. అభివృద్ధి చేతకాకనే వైసిపై నిందారోపణలు చేస్తున్నారని పరోక్షంగా టిడిపిపై చలోక్తులు విసిరారు. శుక్రవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుగ్గన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ ఆఫీసును కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లబ్ధి చేకూర్చేందుకు ప్రజలకు అందుబాటులో లేకుండా మార్చాలని చూస్తున్నా రన్నారు. ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పం తోనే ప్రజలకు అందుబాటులో రూ.90 లక్షలతో పట్టణంలో రిజిస్ట్రేషన్ ఆఫీసు నిర్మాణం చేపట్టామని తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం, ట్రెజరీ, రిజిస్టర్ కార్యాల యాలు ఒక దగ్గర ఉండడం వల్ల ప్రజలకు ఉపయోగమని తెలిపారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టించా మన్నారు. డోన్‌లో పార్కులు, స్విమ్మింగ్ పూల్, ఇండోర్ స్టేడియంలు, విద్యాల యాలు, నిర్మాణాలను జరిపితే వాటిలో ఫర్నిచర్ తెచ్చుకొనే స్తోమత టిడిపి నాయకులకు లేకుండా పోయిందని దుయ్యబట్టారు.

బాధ్యతలేని కమిషనర్: పట్టణంలో కనీస వసతులు కల్పించలేని ఒక బాధ్యత లేని వ్యక్తి కమిషనర్‌గా రావడం దురదృష్టకరమని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్‌ను ఉద్దేశించి అన్నారు. కోట్ల రూపాయలతో నిర్మించిన స్విమ్మింగ్ పూల్, పిల్లలకు ఉపయోగకరమైన పార్కులు కళ్ళ ముందే శిధిలం కావడం పట్ల ఆవేదనగా ఉందన్నారు. రాష్ట్ర చరిత్రలోనే వంద పడకల ఆసుపత్రి, మార్కెట్ ప్రాంగణాన్ని అత్యాధునిక పద్ధతిలో నిర్మించామని క్లబ్ ప్రాంగణంలో ట్రాన్స్ ఫారం కూడా ఏర్పాటు చేసుకోలేని దుస్థితిలో టీడీపీ నాయకులు ఉన్నారని తెలిపారు. పాతపేటకు, కొండపేటకు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా ఆపించిన ఘనత టిడిపి నాయకులకు దక్కుతుందన్నారు. తమ హాయంలో అభివృద్ధికి వేసిన బండల మీద పేర్లను తొలగించవచ్చు కానీ ప్రజల గుండెల్లో ఉన్న అభిమా నాన్ని మార్చలేరని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, శ్రీరాములు, పోస్ట్ ప్రసాద్, సోమేశ్, రాజ్ కుమార్, జాకీర్, మల్లంపల్లి రామచంద్రుడు, దినేష్ గౌడ్, పాతపేట హరి, రమణ, వైఎస్ఆర్ రఫీ, చిరంజీవి, హుస్సేన్ సాహెబ్ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర

విశాలాంధ్ర – బనగానపల్లె: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులను అవమానపరచ డమే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సోమన్న అన్నారు. మండలం పరిధిలోని నందివర్గం గ్రామములో గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, ఏపీ రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు ఎ.సుబ్బారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో 2025-26 ఖరీఫ్ సీజనకు సంబంధించి వరితో సహా14 రకాల పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం జరిగిందని వీటి ధరలు పెరిగిన ఖర్చులకు అనుగుణంగా లేవని కేంద్ర ప్రభుత్వం మరోసారి రైతులకు అన్యాయం చేసిందని విమర్శించారు. అనంతరం నందివర్గములో నూతన రైతు సంఘం ఏర్పాటు చేయడం జరిగింది. కన్వీనర్‌గా కె.కొండారెడ్డి, కోకన్వీనర్ ఎస్.బుజ్జిబాబు, కమిటీ సభ్యులుగా ఎస్.రంగస్వామి, పల్లె శివ నాగిరెడ్డి, పాణ్యం శ్రీనివాసులు, జి.లక్ష్మయ్య, పి.చిన్న శిక్షావలిలతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కార్య క్రమంలో నంద్యాల జిల్లా ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శివయ్య, శివ నాగయ్యలు పాల్గొన్నారు.

విద్యార్థుల విరాళంతో పాఠశాల అభివృద్ధి

విశాలాంధ్ర – రుద్ర వరం: మండల కేంద్రం లోని ఉన్నత పాఠశాలలో విద్యనభ్య సించిన పూర్వ విద్యార్థుల విరాళంతో పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ప్రధానోపాధ్యాయుడు సుబ్బ రాయుడు తెలి పారు. శుక్రవారం ఆయన స్థానిక ఉన్నత పాఠశాల ప్రార్థన ప్రాంగణంలో నూతనంగా వేయిస్తున్న బండ సపటను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న లోపలి భాగంలో నేల ఉండటం వల్ల ప్రార్థన, ఏదైనా ఫంక్షన్ సమయంలో విద్యార్థులు భూమి మీదనే కూర్చవలసిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం నేలపై రాతి బండలతో సపట వేయించడం జరిగిందన్నారు. మరుగుదొడ్ల మరమ్మత్తులు, తాగునీటి సౌకర్యం కోసం చేతి పంపు వేయించడం జరిగిందన్నారు. పూర్వ విద్యార్థులు ఇచ్చిన కొంత మొత్తంలో ఈ పనులను మాత్రమే చేపట్టామన్నారు. ఇంకా పనులు మిగిలి ఉన్నాయని, రాబోయే రోజుల్లో దాతలు, పూర్వ విద్యార్థులు సహాయ సహకారాలు అందిస్తే మిగిలిన అభివృద్ధి పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

పేద యువతి వివాహానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల: పట్టణం 38వ వార్డు నందు నివాసముంటున్న పేద ముస్లిం టిడిపి కార్యకర్త కూతురు వివాహానికి 38వ వార్డు టీడీపీ ఇంచార్జ్ తాటికొండ బుగ్గరాముడు ఆర్థికసాయం అందజేసారు. ఈ సందర్భంగా బుగ్గరాముడు మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్, రాష్ట్ర యువ నాయకుడు ఫయాజ్‌ల ఆదేశాల మేరకు వార్డు నందు నివాసం ఉంటున్న టీడిపి సీనియర్ కార్యకర్త షేక్ ఇమాం హుస్సేన్, షేక్ రహిమున్నిసాల ఏకైక కుమార్తె వివాహానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశామన్నారు. వార్డు నందు ఎవరి వివాహం జరిగినా, వార్డు నందు ఎవరు మరణించినా గత మూడేళ్లుగా వారికి ఆర్థిక సహాయం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తాటికొండ మహేష్ బాబు, చిన్న రాముడు, మోజస్, హాజీ వలి,చెన్నయ్య తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర – పాములపాడు: మండల కేంద్రం లోని ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో పాములపాడు యూత్ ఐకాన్ సభ్యులు వినయ్, అనిల్, వంశీ, బిన్నీ ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లా క్రికెట్ పోటీల సందర్భంగా శుక్రవారం పోటీల ప్రారంభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా మొదటి బహుమతిగా రూ.30 వేలు విరాళంగా ఇచ్చిన దాతలు ప్రభుత్వ టెలికాం అడ్వైజర్ మెంబరు, టిడిపి నందికొట్కూరు నియోజకవర్గ యువ నాయకులు కురువ రమేష్,మండల టిడిపి యువ నాయకులు మధు కృష్ణ, అంజనా వైన్స్ అధినేత శివశంకర్ గౌడ్, రెండోవ బహుమతిగా రూ.20 వేలు విరాళంగా ఇచ్చిన దాత శ్రీ వివేకానంద విద్యా విహార్ కరస్పాండెంట్ ఆర్ఎస్ ఆర్ గోపాల్, మూడవ బహుమతిగా రూ.10 వేలు విరాళంగా ఇచ్చిన దాత ఆర్ఎంపీ డాక్టర్ రాజులు పాల్గొని ప్రారంభించారు. పాస్టర్ వినయ్, పుల్లయ్య, యేసపు, ఐకాన్ యూనిట్ బృందం పాల్గొన్నారు.

వ్యవసాయం లాభసాటిగా మార్చుకోవాలి

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ: రైతులు శాస్త్రీయ సలహాలు పాటించి, పెట్టుబడి ఖర్చు తగ్గించుకొని వ్యవసాయం లాభసాటిగా మార్చుకోవాలని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, కెవికె శాస్త్రవేత్తలు కృష్ణమూర్తి, ఆదినారాయణ అన్నారు. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ మరియు భారత వ్యవసాయ పరిశోధన మండలి సంయుక్తంగ కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం ఆళ్లగడ్డ మండలం లోని ఆర్.కృష్ణాపురం, బాచేపల్లి, పెద్ద కందుకూరు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఖరీఫ్ ముందు చేపట్టాల్సిన సన్నద్ధత కార్యక్రమాలపై వివరించారు. భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం, ప్రస్తుతం పంటల్లో వేయాల్సిన ఎరువుల మొతాదును వివరించారు. కంది, వేరుశనగ, కొర్ర, మొక్కజొన్న, వరి పంటల్లో సస్యరక్షణ చర్యలైన విత్తన శుద్ధి, తెగుళ్ళు, పురుగు మందుల యాజమాన్య పద్ధతులపై, మరియు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆళ్లగడ్డ వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి వ్యవసాయ శాఖ అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఉద్యాన పంటల్లో అధిక దిగుబడులు పొందాలంటే మేలైన రకాల ఎంపిక అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు శేషార్జున్, సాల్మన్, సుధా రాముడు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

దోమలు, వీధి కుక్కల బారి నుండి ప్రజలను కాపాడండి

విశాలాంధ్ర – నంద్యాల అర్బన్: దోమలు, వీధి కుక్కల బారి నుండి ప్రజలను కాపాడాలని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశం లో సిపిఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ వార్డు కౌన్సిల ర్లకు విజ్ఞప్తి చేశారు. నంద్యాల మున్సిపల్ కార్యాల యంలో శనివారం జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమా వేశంలో వీధి కుక్కలు, దోమలతో ప్రజలు ఎదుర్కొం టున్న ఇబ్బందులను గురించి కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తి సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకో వాలన్నారు. నంద్యాల పట్టణంలో వీధి కుక్కలు పిచ్చి కుక్కలు సైర విహారం చేస్తూ పిల్లలను, వృద్ధులను, మహిళలను విచక్షణారహితంగా కరుస్తూ భయభ్రాం తులకు గురి చేస్తున్నా మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఈమధ్య కాలంలో బేతంచర్లలో ఒక పిల్లవాడిని వీధి కుక్కలు చీల్చి చంపడం జరిగిందని, నంద్యాల పట్టణంలో అనేకమార్లు అనేక సంవత్సరాలుగా అన్ని వార్డులలో పిల్లలను మహిళలను విచక్షణారహితంగా కరవడంతో వారు ప్రభుత్వ హాస్పిటల్ లో చేరి చికిత్స చేయించు కోవడం జరిగిందన్నారు. పట్టణంలో దోమ లు విపరీతంగా వృద్ధి చెంది పట్టణ ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.సోమన్న, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు, మహిళా సంఘం పట్టణ కన్వీనర్ సుశీలమ్మ, నాయకులు రవి పాల్గొన్నారు.

మరో మూడు నెలల పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల: రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువును మరో 3 నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ జి.రాజకుమారి శుక్రవారం తెలిపారు. గతంలో రెన్యువల్ చేసిన అక్రిడేషన్ కాల పరిమితి ఈ నెల 31వ తేదీ నాటికి ముగుస్తున్న నేపథ్యంలో మీడియా అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలల పాటు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం మే 31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు పని చేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు జూన్ 1 నుండి ఆగష్టు 31 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం, ఏది ముందు జరిగితే అప్పటివరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు.

దశలవారీగా ఆందోళనలు : సీపీఐ

విశాలాంధ్ర – నంద్యాల అర్బన్ : జిల్లా వ్యాప్తంగా అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేసి, ఇంటి నిర్మా ణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, లేనిపక్షంలో దశల వారీగా ఆందోళనలు చేపడ తామని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఏఐటియుసి పట్టణ కార్య దర్శి శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మలు డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర సమితి ఆదేశాల మేరకు పట్టణంలోని సుంకులమ్మ వీధి, మారుతి నగర్, ఆచార్య కాలనీ, ఏకలవ్య నగర్ కాలనీలలో సీపీఐ ఆధ్వర్యంలో ఇంటి స్థలాలు లేని పేదలతో కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి స్థలాల కొరకై జూన్ రెండవ తేదీన పట్టణంలోని స్థానిక ఎమ్మార్వో కార్యాలయం నందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. ధర్నా కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవుతారని తెలిపారు.

కళ్యాణ మండపానికి భూమి పూజ : మంత్రి

విశాలాంధ్ర – బనగానపల్లె: భక్తులు సౌకర్యార్థం చౌడేశ్వరి అమ్మవారి ఆలయం సమీపంలో వివాహం చేసుకోనేందుకు కళ్యాణ మండపం లేకపోవడంతో నేడు ఎండోమెంట్ ల్యాండ్‌లో దాతల సహకారంతో మండపం నిర్మాణం కొరకు భూమి పూజ చేస్తున్నట్లు రోడ్ల భవనాల శాఖ పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. బనగానపల్లె నియోజకవర్గంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం నందవరం శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయ సమీపంలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన కళ్యాణమండపానికి మంత్రి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మంత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, అభివృద్ధి తమకు రెండు కళ్ళు లాంటివని, ఎన్నికల్లో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటి అమలు పరుస్తున్నట్లు తెలిపారు. ఈవో కామేశ్వరమ్మ, ఆలయ డెవలప్మెంట్ చైర్మన్ పివి కుమార్ రెడ, వెంగన్న, లక్ష్మీకాంత్ రెడ్డి, రమణారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సుబ్బారెడ్డి, బాలి, వల్లి, గొల్ల బాదుల్లా పాల్గొన్నారు.

నాటుసారా తయారీ కేంద్రాలపై మెరుపు దాడి

విశాలాంధ్ర – నందికొట్కూరు: నందికొట్కూరు పట్టణంలోని నీలిషికారి కాలనీలో జరిపిన దాడులలో ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్, ఎస్ఐ మారుతి, నంద్యాల జిల్లా టాస్క్ ఫోర్స్ ఎస్ఐ రమేష్ బాబు నందికొట్కూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ సిఐ రామాంజనేయులు, ఆత్మకూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ వీరాస్వామి, మూకుమ్మడిగా నాటుసారా స్థావరాలపై దాడులు జరిపారు. ఈ దాడులలో 900 లీటర్ల నాటుసారా తయారీకి సిద్ధం చేసిన బెల్లము ఊట ధ్వంసం చేసి, 70 లీటర్ల నాటుసారా సీజ్ చేసి, షికారి రాధ, షికారి రేణుక, షికారి గోల, షికారి మహేష్ అనే నలు గురు వ్యక్తులను అరెస్ట్ చేయడం జరిగింది.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర – కొలిమిగుండ్ల : పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పెట్నికోట గ్రామపంచాయతీ కార్యదర్శి రాఘవరెడ్డి కోరారు. శుక్రవారం చెత్త సేకరణ తోపుడు బండికి మైకు ఏర్పాటుచేసి పారిశుద్ధ్య కార్మికులతో గ్రామంలో వినూత్నంగా ప్రచారం చేయించారు. ఇండ్లతోపాటు, వీధులు, చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున పరిసరాలు అపరిశుభ్రతతో ఉంటే దోమలు వృద్ధి చెంది వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఇంటిలోని తడి,పొడి చెత్తను ప్లాస్టిక్ డబ్బాలలో వేరువేరుగా వేసి, పరిశుధ్య కార్మికులకు అందించాలని, ఎక్కడపడితే అక్కడ వేయవద్దని తెలిపారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకునేందుకు కార్మికులకు సహకరించాలని కోరారు.

రెండోరోజు విగ్రహ ప్రతిష్ట పూజలు

విశాలాంధ్ర – కొలిమిగుండ్ల: మండలంలోని సోత్రియం చెన్నంపల్లి గ్రామంలో నూతన సీతారామాంజనేయ ఆలయవిగ్రహ ప్రతిష్ఠ పూజలు రెండవ రోజు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ప్రదీప్ కుమార్ శర్మ, సతీష్ శర్మల ఆధ్వర్యంలో ప్రతిష్ఠ పూజలు కొనసాగించారు. ఉదయం ప్రాతః కాల పూజ యంత్రములకు అభిషేకం, మహాస్నపనము, గ్రామోత్సవం, అవాహిత దేవత హెూమములు, వేద స్వస్తి, మంగళహారతి తదితర పూజలను చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదములు అందజేశారు. ఆలయ విగ్రహ ప్రతిష్టకు గ్రామ పెద్దలు కమిటీ ఆహ్వానం మేరకు బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ బుడ్డా శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి పూజలో పాల్గొన్నారు. వీరి వెంట వేణు యాదవ్, వెంకటరమణ పాపయ్య తదితరులు ఉన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 31, మే 2025

దేశ సమైక్యతను కాపాడుకుందాం : పి.రామచంద్రయ్య

విశాలాంధ్ర-పత్తికొండ: దేశ సమైక్యత, సమగ్రతను కాపాడుకుం దాం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్‌లు అన్నారు. శుక్రవారం సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో దేశ సమైక్యతను కాపాడుకుందాం అంటూ స్థానిక అంబేద్కర్ సర్కిల్ కూడలి నుండి నాలుగు స్తంభాల మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశ సమైక్యతకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తుందన్నారు. ఉగ్రవాదం, మతోన్మాదం, యుద్ధోన్మా దాన్ని రూపుమాపాలన్నారు. మత సామరస్యం దేశ సమగ్రత పరిరక్షణకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, వైసీపీ మండల కన్వీనర్ కారం నాగరాజు, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు రంగారెడ్డి, వెంకటేశ్వర్లు, దస్తగిరి, సీపీఐ నాయకులు గురుదాస్, కారన్న, రంగన్న, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ హుస్సే న్, వైసీపీ నాయకులు సోమశేఖర్, శ్రీరాములు, గాంధీ రెడ్డి, శ్రీనివాసులు, సీపీఐ(ఎం) ప్రజాసంఘాల నాయకులు సురేంద్ర, గోపాల్, కాశన్న, నరసన్న పాల్గొన్నారు.

టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులు వేగవంతం కావాలి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : పరిశ్రమల స్థాపనకు వీలుగా నిర్దేశించిన గడువు లోపు అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులకు అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్‌కు సంబంధించి 09 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని, వీటికి వేగవంతంగా అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఈఈని ఆదేశించారు. టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులు ఎంతవరకు వచ్చాయని కలెక్టర్ ఆరా తీశారు. ల్యాండ్ లెవెలింగ్, ముళ్ళ పొదల తొలగింపు పూర్తయిందని, సోమవారం మెటీరియల్ వస్తోందని ఏపీఎంఐపీ పిడి కలెక్టర్‌కు వివరించారు. ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు దేవనకొండ మండలం ఈదుల దేవర బండ గ్రామంలో 10 ఎకరాలను కేటాయించడం జరిగిందని, ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఇందులో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయడం జరుగుతోందని, ఇందుకు సంబంధించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏపీఐఐసీ జడ్ఎంను ఆదేశించారు. బనవాసి టెక్స్టైల్ పార్కులో త్వరితగతిన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఏపీఐఐసీ జడ్ఎంను ఆదేశించారు. మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కూడా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇండ స్ట్రీస్ జీఎంను ఆదేశించారు. ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌కి నీటి సరఫరా పైపులైన్ నిర్మాణపు పనులు ఎంత వరకు వచ్చాయని ఏపీఐఐసీ జడ్ఎంను అడిగి తెలుసుకున్నారు. 70 శాతం పూర్తి అయ్యాయని జడ్ఎం కలెక్టర్‌కు వివరించారు. జూలైలోపు పైప్ లైన్ నిర్మాణపు పనులు పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. దూపాడు - బేతంచెర్ల రైల్వే లైన్ ఏర్పాట్లు భూసేకరణ చేయాలని కలెక్టర్ ఏపీఐఐసీ జడ్ఎం ను ఆదేశించారు. రైల్వే లైన్, నీటి పైప్ లైన్, ఎయిర్ పోర్టు లు పరిశ్రమలకు కనెక్ట్ అయితే అభివృద్ధి వేగవంతం అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జైరాజ్ ఇస్పాత్, జియో మైసూర్, గ్రీన్ కో తదితర కంపెనీల ద్వారా స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ జీఎంను ఆదేశించారు. ఇందుకు సంబం ధించి వారితో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పీఎం విశ్వకర్మ పథ కానికి సంబంధించి 2135 దరఖాస్తులను ప్రభుత్వానికి పంపడం జరిగిందని, వీటి మంజూరు ప్రగతికి సంబంధించి చర్చించేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఇండస్ట్రీస్ జీఎంను ఆదేశించారు..కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ నీటి సరఫరాకు సంబంధించి ఎస్టిమేట్స్ వేయించాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ ఇన్చార్జి జీఎం అరుణ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, ఏపీ ఎంఐపీ పిడి ఉమా దేవి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈ ఈ కిషోర్ కుమార్ రెడ్డి, ఐలా చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, జిల్లా దళిత్ ఇండస్ట్రీస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ దిలీప్ కుమార్, ఇతర శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ అక్రమ ఫీజులపై తీసుకోవాలి

విశాలాంధ్ర - నందవరం: మండలంలోని ప్రైవేట్ స్కూళ్లలల్లో అడ్మిషన్ ఫీజుల అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు విష్ణు, కాశీం, సమీర్ కోరారు. శుక్రవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలో డొనేషన్ వసూలు చేయడం ప్రభుత్వ నిబంధనాల విరుద్ధమని, జీవో నెం.1 ప్రకారంగా ఫీజులు మాత్రమే వసూలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసి, బయట నోటీసు బోర్డులో ఉంచాలని, ఆ తర్వాత ఆ స్కూల్లో పిల్లలకు మౌలిక సదుపాయాలు కల్పించి, ఫీజులు వసూలు చేయాలన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

విశాలాంధ్ర- ఆలూరు: ఆలూరు పట్టణంలో సిద్దేశ్వర కాలనీలో సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం వాల్ పోస్టర్లు విడుదల చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజ నేయులు మాట్లాడుతూ, రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు వి.చంద్రకాంత్ రెడ్డి, ఏఐటియుసి తాలూకా కార్యదర్శి వి.రంగన్న సిద్దేశ్వర శాఖ కార్యదర్శి సిద్దలింగ, తులసమ్మ, లక్ష్మి, ఉల్లిగప్ప, షేక్ అన్న ఈరన్న, లింగప్ప, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయంపై తెలియజేయండి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: మండలంలో వర్ష భావ పరిస్థితులు దృష్ట్యా విద్యుత్‌కు అంతరామేర్పడితే వెంటనే తమకు తెలియజేయాలని విద్యుత్ ఎఈ మద్దిలేటి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కృష్ణగిరి విద్యుత్ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ మండలంలో ఐదు సబ్ స్టేషన్లు ఉన్నాయి వాటి పరిధిలో ఉన్న 33/ 11 కెవిలో విద్యుత్తుకు అంతరాయం ఏర్పడినప్పుడు, సమస్యలు ఏవైనా ఉంటే ఆయా పరిధిలో ఉన్న సబ్ స్టేషన్ ఆపరేటర్లకు, లైన్‌మెన్ దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారులకు తెలుపుతారన్నారు. గ్రామాల ప్రజలు, రైతులు కరెంటుపై సొంత ప్రయోగాలు చేసి ప్రమాదాల బారిన పడకండి అన్నారు. క్రిష్ణగిరి సబ్ స్టేషన్ 7382605506, కంబాలపాడు సబ్ స్టేషన్ 7382605507, ఆగవేలి సబ్ స్టేషన్ 9347429492, లక్కసాగరం సబ్ స్టేషన్ 9154824198, చిట్యాల సబ్ స్టేషన్ 8712622589లకు తెలపాలన్నారు.

కామ్రేడ్ లలిత మృతిపట్ల నివాళులు

విశాలాంధ్ర - ఆస్పరి : చత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లా అబుజ్‌మార్ అడవుల్లో ఈ నెల 21వ తేదీన జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ సంగీత అలియాస్ లలిత మృతికి జై భీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. శుక్రవారం మండల పరిధిలోని ములుగుందం గ్రామంలో లలిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా జై భీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ మాట్లాడుతూ లలిత చిన్నతనం నుండే అన్యాయం జరిగితే సహించేది కాదన్నారు. దళిత, గిరిజన హక్కుల కొరకు ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. నర్సుగా పని చేస్తూ 20 ఏళ్ల నుంచి ములుగుందం గ్రామానికి తిరిగి రాలేదన్నారు. ఈ నెల 21న సంగీత అలియాస్ లలితమ్మ కేంద్ర బలగాలు జరిపిన కాల్పుల్లో మృతి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సలహాదారుడు అంజినయ్య, జై భీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మణికుమార్, ఆదోని నియోజకవర్గం ఇంచార్జీ రాజబాబు, ఎంఈఎఫ్ కర్నూలు జిల్లా అధ్యక్షులు పంపయ్య, ఎమ్మార్పీఎస్ ములుగుందం గ్రామ నాయకులు లక్ష్మన్న, రాజేష్, జయన్న సంగీత కుటుంబ సభ్యులు ఆగస్టిన్, దుబ్బన్న పాల్గొన్నారు.

తెగిపోయిన విద్యుత్ వైర్లు

- నిద్రావస్థలో విద్యుత్ శాఖ అధికారులు
- ఆందోళన చెందుతున్న రైతు

విశాలాంధ్ర - తుగ్గలి: మండల పరిధిలోని గిరిగేట్ల గ్రామంలోని బోలా భీమలింగ అనే రైతు పొలంలో విద్యుత్ వైరు తెగిపోయి మూడు రోజులు కావస్తున్న సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ రైతు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన గాలి వర్షానికి విద్యుత్ స్తంభానికి ఉండే వైరు తెగిపోవడం జరిగింది.దీంతో రైతు భీమిలింగ గత మూడు రోజుల నుండి విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ తిరిగి వేడుకుంటున్న విద్యుత్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ఆ రైతు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. తన వ్యవసాయ తోటలో నాటిన టమోటా, మిరప నారా ఎండిపోతుందని తీవ్ర ఆవేదన చెందుతున్నారు. గత మూడు రోజుల నుండి విద్యుత్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న విద్యుత్ శాఖ అధికారులు వైరు బిగించడం లేదని, అధికారులు ఏమి నిద్రపోతున్నారా అని చుట్టుపక్కల రైతులు విమర్శిస్తున్నారు. కరెంట్ లేకపోవడంతో తాను నాటిన మిరపనారా, టమోటా నారా ఎండిపోయిందని, పట్టించుకోని అధికారులపై సంబంధిత జిల్లా అధికారులు మండల విద్యుత్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్‌కు, జిల్లా కలెక్టర్‌కు స్వయంగా కలిసి విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తానని తెలిపారు. జరిగిన నష్ట పరిహారం విద్యుత్ అధికారులు నుండి ఇప్పించాలని కోరుతామన్నారు.

వివరణ: ఈ విషయం ను విద్యుత్ శాఖ ఏ ఈ దృష్టికి తీసుకెళ్లగా వైర్లు తెగిపోయిన విషయం వాస్తవమేనని, త్వరలో వైర్లు బిగిస్తామని తెలిపారు.

తాగునీటిని వృథా చేస్తే కొళాయి కనెక్షన్ తొలగింపు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో తాగునీటిని ఎవరైనా వృథా చేస్తే సంబంధిత గృహ, వాణిజ్య కొళాయి కనెక్షన్ తొలగించడం జరుగుతుందని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన ప్రకాష్ నగర్, సంకల్ బాగ్, ధర్మపేట, బిర్లా కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రకాశ్ నగర్ నందు మున్సిపల్ తాగునీటితో కొందరు రహదారులను శుభ్రం చేస్తుండడాన్ని గమనించిన కమిషనర్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత గృహాల ట్యాబ్ కనెక్షన్‌లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. దీంతో డిఈఈ మనోహర్ రెడ్డి తాగునీటిని వృథా చేస్తున్న ట్యాబ్ కనెక్షన్‌లను తొలగించారు. అదేవిధంగా కమిషనర్ పరిమళ నగర్, ప్రభుత్వ ఆసుపత్రిల్లోని అన్న క్యాంటీన్‌లను పరిశీలిం చారు. ఆహార నాణ్యత ప్రమాణాలు, శుభ్రత పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజల కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి, నీటిని శుద్ధి చేసి ప్రజలకు అందిస్తున్నామని, అయితే దీనిని కొందరు ఇంటి అవసరాలకు వినియోగించుకోకుండా, వాహనాలను, రహదారులను శుభ్రం చేయడానికి, గార్డెనింగ్‌లకు వాడడం మంచిది కాదన్నారు. ఇది ఏమాత్రం సబబు కాదని, వాటికి ఇతర నీటిని వినియోగించుకోవాలని సూచించారు. నగరంలో వేసవి తీవ్రత ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని, కొన్ని ప్రాంతాల్లో రెండు, మూడు రోజులకు నీటిని అందించిన దాఖలాలు సైతం ఉన్నాయన్నారు. ఇప్పటికి కొన్ని కాలనీలకు ప్రతిరోజూ నీళ్ళు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నామని, దీనిని కొందరు గ్రహించకపోవడం బాధాకరమన్నారు. నీళ్ళు ప్రాణాధారమని, వాటిని వృథా చేస్తే భావి తరాలకు కన్నీరే మిగులుతాయన్నారు. ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, తాగునీటిని వాహనాలు, రహదారుల శుభ్రత, గార్డెనింగ్‌లకు వినియోగించరాదని పేర్కొన్నారు. ట్యాబ్‌లను ఓపేన్ చేసి వదిలేయడం, ఇంటి ఓవర్ హెడ్ ట్యాంకులకు ఓవర్ ఫ్లో చేసి నీటిని దుర్వినియోగం పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే వారిపై చర్యలు తీసుకుంటామని, ట్యాబ్ కనెక్షన్ తొలగిస్తామని కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో డిఈఈ మనోహర్ రెడ్డి, పారిశుద్ధ్య తనిఖీదారుడు రమేష్‌లు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం జూన్ 2న సీపీఐ ధర్నా

విశాలాంధ్ర - ఆస్పరి: పేదల సొంతింటి కలను సాకారం చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 2న మండల కేంద్రంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేపడుతున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి, పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తిలు తెలిపారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జూన్ 2న జరుగు ధర్నా కార్యక్రమం యొక్క వాల్ పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఎన్నికల ప్రచారంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను అమలలో పొందుపరిచిన ఇంటి స్థలాలు గ్రామాల్లో 5 సెంట్లు, పట్టణాల్లో 3 సెంట్ల భూమి కల్పించడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాని డిమాండ్ చేశారు. జూన్ 2న తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రంగన్న, హనుమంతు, గోవిందు, వీరశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలి వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకుల కొరకు లిరవీంద్ర మహిళా డిగ్రీ కళాశాల నందు జాబ్ మేళా నిర్వహించటం జరిగింది. ఈ జాబ్ మేళా నందు 16 కంపెనీ ప్రతినిధులు ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో దాదాపుగా 401 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. 154మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరీ చరిత రెడ్డి రవీంద్ర మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జి.పుల్లయ్య ప్రిన్సిపాల్ జ్యోతి, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ఎల్,ఆనంద్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి 5 లక్షలు ఇవ్వాలి

విశాలాంధ్ర - పెద్ద కడబూరు: అర్హులైన పేదలందరికీ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలంటూ జూన్ 2న మండల కార్యాలయాల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబు, హసన్, చిన్నోడు, నర్సింహులు, నబి రసూల్, చాంద్ బాష పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: ఎలాంటి నియమ నిబంధనలు లేకుండా పారిశుద్ధ కార్మికులకు సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలి అని ఏఐటీయూసీ నాయకులు కోరారు. శుక్రవారం డిప్యూటీ తహశీల్దార్ వీరేంద్ర గౌడ్‌కి వినతి పత్రం సమర్పించారు. ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు వీరేష్, తిమ్మ గురుడు, మున్సిపల్ కార్మికులు ఎల్లప్ప, శివకృష్ణలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు నరసింహారెడ్డి, విజేంద్ర మున్సిపల్ పార్సిద కార్మికులు టి.హరిప్రసాద్, ఈరన్న ఏఐటీయూసీ నాయకులు శేఖర్, అమృత రాజు, బాష తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర - దేవనకొండ: కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానం మేరకు పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇస్తూ ఇంటి నిర్మాణ వ్యయం 5 లక్షలకు పెంచాలని అలాగే సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు, పట్టణ సహాయ కార్యదర్శి వి.రాజశేఖర్ లు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన నిరుపేదలకు ఇంటి స్థలాలపై మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగు ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ దేవనకొండలో వాల్ పోస్టర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని, సూపర్ సిక్స్ హామీలో భాగంగా హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఏపీ రైతు సంఘం మండల గౌరవ అధ్యక్షులు వై.కండప్ప, సిపిఐ నాయకులు శేఖర్, రవి, భాస్కర్, మహబూబ్ బాష, టైలర్ రామంజి, మధు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

విశాలాంధ్ర -గూడూరు: గృహ నిర్మాణాలను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ చిరంజీవి లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం హౌసింగ్ పీడీ గూడూరు మండలంలో పర్యటించి గృహ నిర్మాణాల పనులను పరిశీలించిన అనంతరం గూడూరు ఎంపిడిఓ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పిడి చిరంజీవి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో ఇంటి నిర్మాణాలు పూర్తి చేస్తే బిల్లులు త్వరగా లబ్ధిదారు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. ఎంపీడీవో శివనాగ ప్రసాద్, హౌసింగ్ ఏఈ జమ్మన్న, వర్కు ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు, కంప్యూటర్ ఆపరేటర్ వెంకటేష్ పాల్గొన్నారు.

శ్రీశైలంకు భారీ వరద నీరు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : శ్రీశైలంకు బారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. ఈ ఏడాది రుతుపవనాలు త్వరగా రావడంలో కర్నాటక, మహారాష్ట్ర కురుస్తున్న బారీ వర్షాల కారణంగా తెలంగాణాలో ఉన్న జూరాల ప్రాజెక్టుకు బారీగా వరద నీరు చేరి నిండుకుండలా చేరుకుంది. దీంతో జూరాల నుండి 12 గేట్లు ఎత్తి దిగువ శ్రీశైలం ప్రాజెక్టుకు నీరు విడుదల చేస్తున్నారు. దీంతో శుక్రవారం శ్రీశైలంకు 88,835 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. సుంకేసుల నుండి 8,824 క్యూసెక్కులు నీరు శ్రీశైలంకు విడుదల చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 885 అడుగులు కాగా ప్రస్తుతం 818.20 అడుగలకు చేరుకుంది. ప్రాజెక్టు నీటి సామర్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 39.5529 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద నీరు ఇలానే కొనసాగితే మరింత నీరు వచ్చి చేరే అవకాశం ఉంది.

కత్తులతో బెదిరించి నగదు చోరీ

విశాలాంధ్ర- గూడూరు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న చోదకుడుని గుర్తు తెలియని దుండగులు కత్తులతో బెదిరించి నగదు చోరీ చేసినట్లు సమాచారం. బాధితుని వివరాల ప్రకారం గూడూరుకు చెందిన మున్నా అనే వ్యక్తి రాత్రి 8 గంటల సమయంలో గూడూరు నుండి కోడూమూరు వైపుకు వెళుతుండగా చనుగొండ్ల, కొడుమూరు రోడ్డు మార్గం కాల్వ దగ్గర దుండగులు బైకును వెంబడించి కత్తులతో బెదిరించి, దాడి చేసి రూ.5 వేలు నగదు, సెల్ ఫోను లాక్కున్నారు. ఎదురుగా వాహనాలు రాకతో సెల్ ఫోన్ అక్కడే వదిలేసి పరారైనట్లు బాధితుడు తెలిపారు. గురువారం రాత్రి కోడుమూరు ఎస్సై ఎర్రి స్వామికి ఫిర్యాదు చేయగా దాడికి గురైన బాధితులు మున్నాను ఆసుపత్రికి పంపించి, చికిత్స చేయించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వివాహితపై హత్యాయత్నం

విశాలాంధ్ర -వెల్దుర్తి: పట్టణంలో నివాసముంటున్న ఓ వివాహితపై ఆమె భర్త, మరిది హత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది.బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన షెహనాజ్కు తడకనపల్లె మౌలా లికి మూడేళ్ల కిందట వివాహమైంది. పిల్లలు లేని ఈ దంపతులు, మౌలాలి తమ్ముడు నాసీర్‌తో వెల్దుర్తి పట్టణంలోని కుమ్మరి వీధిలో నివాసముంటున్నారు. గురువారం రాత్రి అపస్మారక స్థితిలో ఉన్న తన అక్క షెహనాజ్ విషయం భావ మౌలాలి ద్వారా తెలుసుకున్న ఆమె సోదరుడు అబ్దుల్లా తన అక్క ఇంటికి చేరుకుని హుటాహుటిన షెహనాజ్‌ను చికిత్స నిమిత్తం వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించాడు. షెహనాజ్ తమ్ముడు ఇంటికి వచ్చే సరికే జ్వరం, కడుపునొప్పి, మోకాళ్ల నొప్పి ఇతరత్రా మందుమాత్రలు మింగినట్లు గుర్తించిన వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం ఆమెను మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు తన సోదరి షెహనాజ్‌ను వదిలించుకోవాలన్న నెపంతోనే ఆమె భర్త మౌళాలి, మరిది నాసీర్‌లు బలవంతంగా మందుమాత్రలు నోట్లో కుక్కి, హత్యాయత్నం చేసినట్లు బాధితురాలి అక్క నస్రీన్, భావ సుభాన్లఊాశుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు షెహనాజ్ భర్త మౌళాలి, మరిది నాసీర్‌లను అదుపులోకి తీసుకొని, స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు.

ఉపాధి హామీలో కూలీల కష్టం.. నొక్కేస్తున్నారు

విశాలాంధ్ర నందవరం: ప్రతి రోజు ఉపాధి పనులకు వెళ్ళండి, మీరు చేసే పనికే కూలి అంది స్తామని చెపుతున్న ఉపాధి హామీ అధికారుల మాట కాగితల్లో తప్ప చేతల్లో కనిపించడం లేదు. గ్రామా ల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటిలు కుమ్మక్కై పనికి 5 మంది హాజరైతే 8, 10 మంది వచ్చినట్లు హాజరు వేసుకొని డబ్బులను పంచుకుంటున్నట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం పని ప్రదేశంలో పోటో అప్లోడ్ చేయాలనే నిబంధన పెట్టడంతో ఫోటోలో ఏడు మంది కూలీలు ఉంటే 9 మంది హాజరైనట్లు, ఇద్దరు మహిళలు హాజరైతే ఏకంగా 6 మంది మహిళలు వచ్చినట్లు రికార్డు చేసి బిల్లులను నొక్కేస్తున్నారు. ఉపాధి కూలీల కష్టాన్ని మెటీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి నొక్కేస్తూ మరోపక్క మెటీలు ఏకంగా తమ కుటుంబ సభ్యులు హాజరు కాకపోయినా హాజరైనట్లు, మరి కొంతమందితో ముందస్తుగా మాట తీసుకుని వచ్చే డబ్బులో 60శాతం నాకు, 40 శాతం నీకు అని మాట్లాడుకుని హాజరు వేస్తున్నారు. కష్టం మాత్రం కూలీలు చేస్తుంటే, లాభం మాత్రం పంచుకుంటున్నారు. ఈ నొక్కుడు విషయాలు తెలియని కూలీలు తాము చేసిన పనికే డబ్బులు వస్తున్నాయనే భ్రమలో రోజు కూలి పని చేస్తూ కాలం గడిపేచేస్తున్నారు. రోజువారిగా మాస్టర్లు, ఫోటో అప్‌లోడ్‌లను తనిఖీ చేయాల్సిన ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు తనిఖీలు చేస్తున్నారా, లేక ఆ డబ్బుల్లో కమీషన్లు తీసుకొని వదిలేస్తున్నారా.. అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

వెన్నుపోటు కాదు, బాబాయిపై గొడ్డలి పోటు : టీడీపీ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: కడపలో నిర్వహించిన మహానాడు బారీ సక్సెస్ అయిందని, అనుకున్న దాని కంటే ఎక్కువ మంది హాజరైనారని, దీన్ని ఓర్చుకోలే వైసీపీ నేతలు అవాక్కులు, చవాక్కులు పేలు స్తున్నారని, వైసీపీ నేతలు వెన్నుపోటు కాదు, బాబాయిపై గొడ్డలి పోటు ఎవరు వేశారో తేల్చాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో కుడా చైర్మెన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ జిల్లా ప్రదాన కార్యదర్శి ప్రభాకర్, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మెన్ ఈశ్వర్, డీసీఎం ఎస్ చైర్మెన్ నాగేశ్వరరావుయాదవ్‌లతో కలసి ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రంను అస్తవ్యస్తం చేశారని, అక్రమ కేసులు, అవినీతి, మద్యం, మైనింగ్, ఇసుక దోచుకుని అవినీతి పాలన చేశారని విమర్శిం చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో పరిపాల నను గాడిలో పెట్టడమే కాకుండా ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పించన్లు, ఉచిత సిలిండర్లు, మెగాడీఎస్సీ విడుదల చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 4 వెన్నుపోటు దినంగా జరుపుకోవాలని వైసీపీ నేతలకు పిలుపు ఇవ్వడాన్ని తప్పు పట్టారు. వెన్నుపోటు రాజకీయం ఎవరిదని ప్రశ్నించారు. బాబాయిపై గొడ్డలిపోటు ఎవరు వేశారో ప్రజలందరికి తెలుసన్నారు. తల్లిని, చెల్లిని బయటకు తరిమింది ఎవరన్నారు. దేశంలో ఏపీ మొదటి స్థానంలో ఉంచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారని తెలిపారు. టీడీపీ నాయకులు నాగేంద్ర, రవికుమార్, హనుమంతరాయ చౌదరి ఉన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శనివారం 31, మే 2025

జిల్లా జట్టు విజయం సాధించాలి

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: గుంటూరులో ఆంధ్రప్రదేశ్ స్టేట్ అసోసియేషన్ ఆఫ్ జర్నలిస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో జిల్లా జర్నలిస్టుల జట్టు విజయంతో తిరిగి రావాలని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ ఆకాంక్షించారు. నగరంలోని గాయత్రీ ఎస్టేట్లో ఉన్న శ్రీ గురుదత్త పాలి క్లినిక్‌లో జరిగిన కార్యక్రమంలో కర్నూలు జిల్లా క్రికెట్ జట్టు జర్నలిస్టులకు ఆయన క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో క్రికెట్ క్రీడకు అత్యంత ప్రాచుర్యం ఉందని ఆయన తెలిపారు. క్రికెట్ క్రీడా ఇంగ్లాండ్‌లో పుట్టినప్పటికీ, క్రికెట్‌కు మన దేశాన్ని మెట్టినిల్లుగా భావించవచ్చని తెలిపారు. ఈ క్రీడలో అత్యంత ప్రాచుర్యం పొందిన గాడ్ ఆఫ్ క్రికెట్‌గా పేరుందిన సచిన్ టెండూల్కర్‌కు భారతరత్న వంటి ప్రతిష్టాత్మక అవార్డు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మన దేశంలో మారుమూల గ్రామాల్లో సైతం ప్రతి గల్లీలో క్రికెట్ క్రీడా కనిపిస్తుందని చెప్పారు. మిగతా క్రీడలతో పోలిస్తే క్రికెట్ క్రీడా సులువుగా అర్థమవుతుందని తెలిపారు. ఈ క్రీడలో క్రీడాకారులందరూ సమిష్టిగా రాణిస్తేనే విజయం సాధ్యం అవుతుందని తెలిపారు. ఈ క్రీడలో క్రీడాకారులు అధికంగా ఉండటం వల్ల వారి మధ్య స్నేహం, పరస్పర సహకారం వంటి అంశాలు చోటుచేసుకుంటాయని తెలిపారు. ఈ క్రీడల్లో రాణించాలంటే ఏకాగ్రత అవసరమని, ఏకాగ్రత కోల్పోతే పరాజయం తప్పదని తెలిపారు. జీవితంలో విజయం సాధించిన గొప్ప వారిని ఎవరిని అడిగిన వారి విజయం వెనుక ఏకాగ్రత ఉందన్న విషయం అవగతం అవుతుందని తెలిపారు .క్రీడల్లో పాల్గొనడం వల్ల గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తి అల వడుతుందని, ఇది జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా జర్నలిస్టుల క్రికెట్ జట్టు మోహన్, వైస్ కెప్టెన్ చిరంజీవి, మేనేజర్ శివరాజ్ కుమార్, సభ్యులు స్నేహల్, రవికుమార్, శివ, సుదర్శన్, భూషణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలి : మంత్రి

విశాలాంధ్ర బ్యూరో కర్నూలు : ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు వైద్యులు, ఇతర అధికారులను ఆదేశించారు. స్టేట్ గెస్ట్ హౌస్‌లో ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధిపై ప్రభుత్వ సర్వజన వైద్యశాల అధికారులు, మున్సిపల్, హార్టికల్చర్, తదితర అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయి ఆసుపత్రిగా అభివృద్ధి చేయడానికి, ప్రజలకు సేవలను అందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి అన్ని సమస్యలను తెలియజేసినట్లయితే వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు, వైద్యారోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని మంత్రి తెలిపారు. మంత్రి మాట్లాడుతూ అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు, రోగులు, పేషెంట్ అటెండెంట్లు, ఆసుపత్రికి వచ్చే ప్రజల కోసం గుర్తించబడిన పార్కింగ్ స్థలాలను మెరుగుపరచాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. అత్యవసర ప్రాంతాల నుండి వార్డులకు ఇతర క్లిష్టమైన ప్రాంతాలకు ట్రాలీలు, వీల్‌చైర్‌ల కదలిక కోసం ప్రత్యేకంగా అంతర్గత రోడ్లను మెరుగుపరచడానికి సూచనలు జారీ చేశారు. ఆసుపత్రిలోకి రావడానికి 2వ గేట్‌ను తెరవడానికి, దానిని త్వరలో అందుబాటులోకి తీసుకురావడానికి, వాహనాలు, రోగుల స్వేచ్ఛా ప్రవాహానికి లోపలికి మరియు బయటికి ప్రవేశ ద్వారాలను ఏర్పాటు చేయాలని సంబంధిత

అధికారులు ఆదేశించారు. అన్ని ప్రాంతాలలో అన్ని సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయని నిర్ధారించుకోవడానికి, క్లిష్టమైన ప్రాంతాలలో అవసరమైతే కొనుగోలు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ, స్కాన్ యంత్రాలను ఉపయోగించుకోవాలని, అన్ని ఐసీయూలు, ఓటీలు వెంటిలేటర్లు వంటి క్లిష్టమైన పరికరాలలో కనెక్షన్ ఉండేలా చూడాలని అన్నారు. సీఎంఎస్ మోడ్‌లో విద్యుత్ పరికరాలు, ఏసీలు, జనరేటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలో మరిన్ని విద్యుత్ పరికరాల నిర్వహణ ఉన్నందున వెంటనే ఏఈని నియమించాలని జెడ్పీ సీఈఓ, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈతో మాట్లాడి ఆదేశించారు. అన్ని ప్రాంతాలలో ఆసుపత్రిలో ప్రాధాన్యతా ప్రాతిపదికన ఆక్సిజన్ పైపులైన్ల నిర్వహణను నిర్ధారించాలని, ఏదైనా లీకేజీ నోటీసు ఉంటే సరిదిద్దడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంసిహెచ్ బ్లాక్‌లో కఠినమైన సందర్శకుల విధానాన్ని ప్రారంభించాలన్నారు. సాధారణ, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ కఠినమైన వ్యర్థాల నిర్వహణ సరిగ్గా చేయాలన్నారు. ఆసుపత్రిలో అగ్నిమాపక భద్రతా పరికరాలు అందుబాటులో ఉన్నాయని నిర్ధారించుకోవడానికి మరియు జిల్లా అగ్నిమాపక అధికారితో గ్యాప్ విశ్లేషణ తీసుకోవడానికి, ఛార్జీల భద్రతపై అన్ని భద్రతా సిబ్బందికి శిక్షణ పొందేలా చూడాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు, పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా హాస్పిటల్లోని లేఔట్ ప్రకారం ప్రణాళిక బద్ధంగా మొక్కలను నాటేలా చర్యలు తీసుకోవాలని ఆర్టికల్చర్ అధికారులకు సూచించారు. ఆసుపత్రి డిజిటలైజేషన్ ఓపీ, ఐపీ, ఫార్మసీ, డయాగ్నోసిస్, డిశ్చార్జ్ సారాంశం వంటి ఆసుపత్రి డిజిటలైజేషన్‌ను మెరుగుపరచడానికి, అధునాతన సాఫ్ట్‌వేర్‌లను స్వీకరించడం ద్వారా సంవత్సరం చివరి నాటికి దానిని పూర్తిగా కాగితరహితంగా మార్చాలన్నారు, ఏదైనా పోస్టులు ఖాళీగా ఉంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ జారీ చేసి ఖాళీలను భర్తీ చేయాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి వ్యర్థ ఇనుప స్క్రాప్‌ను వెంటనే ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిజిహెచ్ సూపరిండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, ఆర్టికల్చర్ ఏడి విజయలక్ష్మి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న డుండి రాకేష్

విశాలాంధ్ర -బనగానపల్లె: మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటిలో వెలిసిన శ్రీ ఉమామహేశ్వర స్వామి వారిని తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగాల రాష్ట్ర అధ్యక్షులు, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏపీ రాష్ట్ర చైర్మన్ డుండి రాకేష్ దంపతులు స్వామివారిని శుక్రవారం నాడు దర్శించుకోవడం జరిగింది. ఆలయం చేరుకోగానే ఆలయ పండితులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ముందుగా డుండి రాకేష్ బనగానపల్లె చేరుకోగానే టంగుటూరి శీనయ్య కార్యాలయం దగ్గర ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగాల నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య స్వాగతం పలికి పూలమాల శాలువతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మౌలిశ్వర్ రెడ్డి నాగేంద్రారెడ్డి, వెంకటేష్, బండారు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విందు భోజనం అందజేసిన ఇలియాస్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : కడపలో జరిగిన మహానాడుకు తరలివెళ్లిన టిడిపి నాయకులు, కార్య కర్తలకు సాగునీటి సంఘం ఛైర్మన్ చాబోలు ఇలియాస్ విందు భోజనం అంద జేశారు. టీడీపీ చరిత్రలో సుస్థిర స్థానాన్ని సంపా దించుకున్న మహానాడు సభలు పార్టీ సిద్ధాంతాల ప్రతిధ్వని, ప్రజా సమస్యలపై చర్చల వేదికగా నిలుస్తూ, ప్రజల ఆకాంక్షలకు మార్గద ర్శకంగా నిలుస్తాయనీ, అలాంటి అద్భుతమైన మహానాడు మహా సభల కోసం కడపకు బయలుదేరిన టిడిపి నాయకులు, కార్యకర్తలకు అభినం దనీయ సేవలు అందించారు. సాగునీటి సంఘం ఛైర్మన్ చాబోలు ఇలియాస్. చాబోలు ఇలియాస్ ప్రతి కార్యకర్తకు రుచికరమైన భోజనం అందించాలనే తలంపుతో తెల్లవారు జామునే రుచికరమైన బిర్యాని వండి ప్యాక్ చేసి కడపకు బయలుదేరిన ప్రతి కార్యకర్తకు అందేలా కృషి చేశారు. చాబోలు ఇలియాస్ నేతృత్వంలో వందలాది టీడీపీ నాయకులు కార్యకర్తలు ప్రత్యేక బస్సులు, వాహనాల్లో కడపకు బయలుదేరి మహానాడు సభలో పాల్గొని విజయవంతమయ్యేలా కృషి చేశారు.

చౌడేశ్వరి అమ్మవారికి పల్లకి సేవ

విశాలాంధ్ర - బనగానపల్లె: మండల పరిధిలోని నందవరం గ్రామంలో వెలిసిన చౌడేశ్వరి అమ్మవారికి దేవస్థానం నందు శుక్రవారం సందర్భంగా పల్లకి సేవ కార్యక్రమం ఈవో కామేశ్వరమ్మ, ఆలయ పండితులు రామకృష్ణయ్య, ప్రతిపయ్య, పవనయ్య నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమము నందు మాజీ చైర్మన్ పివి కుమార్ రెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బంది రామ్మోహన్, మణికంత, నాగేశ్వరరావు, భక్తులు తదితరులు పాల్గొనడం జరిగినది.

గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాలన్నీ అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు మండలం రేమట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఊరవాకిలిని కేడిడిసి బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంపి నాగరాజు గ్రామంలో పర్యటించి గ్రామ సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపి ప్రభుత్వం పంచాయితీ నిధులను దారి మళ్లించి గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పంచాయతీ లకు ప్రత్యేక నిధులు విడుదల చేసి, అభివృద్ధి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్ద వెంకన్న, గ్రామ టిడిపి నాయకులు ఊరవాకిలి వెంకటేశ్వర్లు, శేఖర్, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంటనే పరిష్కరించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ - పాములపాడు: ప్రజల వినుతులను సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్క రించాలని నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయ సూర్య అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎంపీపీ రజిని వర్ధిని అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొని, ముందుగా ప్రజల సమస్యల వినతులను స్వీకరించారు. వేంపెంట గ్రామ సర్పంచ్ వై.మాణిక్యమ్మ, టిడిపి నాయకులు లక్ష్మీకాంతారెడ్డి, కంభం.మోహన్ గౌడ్, వై.దానమయ్య మా గ్రామానికి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లేక చాలా ఇబ్బంది పడుతున్నామని కనుక తాటిపాడు గ్రామంలో పనిచేస్తున్న మా పాత పంచాయతీ కార్యదర్శి తిప్పన్నను తమ గ్రామానికి వేయాలని కోరుతూ,

గ్రామ సచివాలయానికి స్తంభాలు వేసి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి పత్రం సమర్పించడం జరిగింది. మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి అంకన్న పాములపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో కొత్త విద్యుత్ స్తంభాలు వేసి కనెక్షన్లు ఇవ్వాలని కోరుచూ మరియు ఇతర సమస్యలపై ప్రజలు వినతి పత్రాలు సమర్పించడం జరిగింది. ఎమ్మెల్యే ప్రతి సమస్యను శ్రద్ధగా విని తగిన శాఖల అధికారులతో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే తన పాలనలో ప్రధాన లక్ష్యమని, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రజలు తమ సమస్య లను నేరుగా చెప్పేందుకు ఈ తరహా వేదికలు ఎంతో ఉపయోగం పడుతాయని ప్రజల సమస్యల పరిష్కారానికి సంబందిత అధికారులతో త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.సుభద్రమ్మ, ఇంచార్జ్ ఎంపీడీవో గాయిత్రి, ఈఓఆర్డి ఎస్.వెంకటరంగ నాయక్, అగ్రికల్చర్ ఏవో ఫణీశ్వర్ రెడ్డి, ఎంఈఓ బాలాజీ నాయక్, ఏపిఎం ఎ.ఉమా మహేశ్వరి, ఏపీవో అలివేలు మంగమ్మ, ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

దూదేకుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల అసెంబ్లీ పరిధిలో నివసిస్తున్న దూదేకుల విద్యార్థిని, విద్యార్థులకు నగదు ప్రతిభ పురస్కారాలు నంద్యాల పట్టణ దూదేకుల సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరుగుతుందని దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షుడు వాసవి దస్తగిరి తెలిపారు. ఈ కార్యక్రమంలో దూదేకుల సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పి.బాబన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన దూదేకుల సంఘం నాయకుల సమావేశంలో వాసవి దస్తగిరి మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో 550.ఆపై మార్కులు సాధించిన దూదేకుల కులానికి చెందిన, నంద్యాల అసెంబ్లీ పరిధిలోని దూదేకుల విద్యార్థిని, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయడం జరుగుతుందన్నారు. పదో తరగతి మార్కు మెమో, ఆధార్ కార్డు నేటి నుండి జూన్ 15వ తేదీలోపు 9849404646, 9866617758 నంబర్లకు వాట్స్ అప్ ద్వారా పంపి, ఫోన్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో దూదేకుల సంఘం నంద్యాల పట్టణ అధ్యక్షుడు షేక్షావలి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోల్డ్ దస్తగిరి, కోశాధికారి హుస్సేనప్ప, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆదాం సాహెబ్, పట్టణ కోశాధికారి సోమశేఖర్, జిల్లా యూత్ అధ్యక్షుడు గబ్బర్ దస్తగిరి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బాలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: న్యాయ సేవా సదన్ నందు బాల్య వివాహ నిరోధక చట్టంపై పురోహితులకు, పాస్టర్స్‌కు, గవర్నమెంట్ కాజీలకు, టెంపుల్స్ ఏఓలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జడ్జి మాట్లాడుతు ఎవరైనా బాల్య వివాహాలు చేయమని మీ దగ్గరికి వస్తే సంబధిత శాఖలకు, 15100 టోల్ ఫ్రీ నంబర్‌కు గాని తెలియజేయాలన్నారు. ఐసీడీస్ ఆఫీసర్ శారద మాట్టాడుతూ ప్రతి గ్రామంలో గ్రామ కమిటీ లు కలవని వారికి బాల్య వివాహ లపై సమాచారం యిస్తే వెంటనే వారు ఆ వివాహన్ని అపి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేస్తారని తెలిపారు. కర్నూలు సీడీపీఓ అనురాధ మాట్టాడుతూ అంగన్వాడీ వర్కర్స్ ఎవరికైనా బాల్య వివాహ లపై సమాచారం తెలిస్తే వెంటనే మహిళ పోలీసులకు, ఐసీడీస్ ఆఫీసర్‌లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఉమాదేవి మాట్లడుతూ చిన్న పిల్లలకు వివాహాలు చేయడం వలన వచ్చే అనారోగ్య సమస్యలను గురించి వివరించారు. మహిళా పోలీస్ ఎస్ఐ కిరణ్ మాట్టాడుతూ బాల్య వివాహాలు చేసిన వారికి, చేయించిన వారికి కఠిన శిక్షలు కలవని తెలిపారు. అనంతరం బాల్య వివాహ నిరోధక చట్టం పోస్టర్స్‌ను విడుదల చేశారు.

తెగిపోయిన విద్యుత్ వైర్లు

- నిద్రావస్థలో విద్యుత్ శాఖ అధికారులు
- ఆందోళన చెందుతున్న రైతు

విశాలాంధ్ర - తుగ్గలి: మండల పరిధిలోని గిరిగేట్ల గ్రామంలోని బోలా భీమలింగ అనే రైతు పొలంలో విద్యుత్ వైరు తెగిపోయి మూడు రోజులు కావస్తున్న సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోక పోవడంతో ఆ రైతు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన గాలి వర్షానికి విద్యుత్ స్తంభానికి ఉండే వైరు తెగిపోవడం జరిగింది.దీంతో రైతు భీమిలింగ గత మూడు రోజుల నుండి విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ తిరిగి వేడుకుంటున్న విద్యుత్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ఆ రైతు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. తన వ్యవసాయ తోటలో నాటిన టమోటా, మిరప నారా ఎండిపోతుందని తీవ్ర ఆవేదన చెందుతున్నారు. గత మూడు రోజుల నుండి విద్యుత్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న విద్యుత్ శాఖ అధికారులు వైరు బిగించడం లేదని, అధికారులు ఏమి నిద్రపోతున్నారా అని చుట్టుపక్కల రైతులు విమర్శి స్తున్నారు. కరెంట్ లేకపోవడం తో తాను నాటిన మిరపనారా, టమోటా నారా ఎండిపోయిందని, పట్టించుకోని అధికారులపై సంబంధిత జిల్లా అధికారులు మండల విద్యుత్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్‌కు, జిల్లా కలెక్టర్‌కు స్వయంగా కలిసి విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తానని తెలిపారు. జరిగిన నష్ట పరిహారం విద్యుత్ అధికారులు నుండి ఇప్పించాలని కోరుతామన్నారు.

వివరణ: ఈ విషయం ను విద్యుత్ శాఖ ఏ ఈ దృష్టికి తీసుకెళ్లగా వైర్లు తెగిపోయిన విషయం వాస్తవమేనని, త్వరలో వైర్లు బిగిస్తామని తెలిపారు.

తాగునీటిని వృథా చేస్తే కొళాయి కనెక్షన్ తొలగింపు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో తాగునీటిని ఎవరైనా వృథా చేస్తే సంబంధిత గృహ, వాణిజ్య కొళాయి కనెక్షన్ తొలగించడం జరుగుతుందని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన ప్రకాష్ నగర్, సంకల్ బాగ్, ధర్మపేట, బిర్లా కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రకాశ్ నగర్ నందు మున్సిపల్ తాగునీటితో కొందరు రహదారులను శుభ్రం చేస్తుండడాన్ని గమనించిన కమిషనర్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత గృహాల ట్యాబ్ కనెక్షన్‌లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. దీంతో డిఈఈ మనోహర్ రెడ్డి తాగునీటిని వృథా చేస్తున్న ట్యాబ్ కనెక్షన్‌లను తొలగించారు. అదేవిధంగా కమిషనర్ పరిమళ నగర్, ప్రభుత్వ ఆసుపత్రిల్లోని అన్న క్యాంటీన్‌లను పరిశీలిం చారు. ఆహార నాణ్యత ప్రమాణాలు, శుభ్రత పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజల కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి, నీటిని శుద్ధి చేసి ప్రజలకు అందిస్తున్నామని, అయితే దీనిని కొందరు ఇంటి అవసరాలకు వినియోగించుకోకుండా, వాహనాలను, రహదారులను శుభ్రం చేయడానికి, గార్డెనింగ్‌లకు వాడడం మంచిది కాదన్నారు. ఇది ఏమాత్రం సబబు కాదని, వాటికి ఇతర నీటిని వినియోగించుకోవాలని సూచించారు. నగరంలో వేసవి తీవ్రత ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని, కొన్ని ప్రాంతాల్లో రెండు, మూడు రోజులకు నీటిని అందించిన దాఖలాలు సైతం ఉన్నాయన్నారు. ఇప్పటికి కొన్ని కాలనీలకు ప్రతిరోజూ నీళ్ళు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నామని, దీనిని కొందరు గ్రహించకపోవడం బాధాకరమన్నారు. నీళ్ళు ప్రాణాధారమని, వాటిని వృథా చేస్తే భావి తరాలకు కన్నీరే మిగులుతాయన్నారు. ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, తాగునీటిని వాహనాలు, రహదారుల శుభ్రత, గార్డెనింగ్‌లకు వినియోగించరాదని పేర్కొన్నారు. ట్యాబ్‌లను ఓపేన్ చేసి వదిలేయడం, ఇంటి ఓవర్ హెడ్ ట్యాంకులకు ఓవర్ ఫ్లో చేసి నీటిని దుర్వినియోగం పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే వారిపై చర్యలు తీసుకుంటామని, ట్యాబ్ కనెక్షన్ తొలగిస్తామని కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో డిఈఈ మనోహర్ రెడ్డి, పారిశుద్ధ్య తనిఖీదారుడు రమేష్‌లు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరించిన మంత్రి

విశాలాంధ్ర - బనగానపల్లె: క్షేత్ర స్థాయి ప్రజల నుంచి వచ్చే వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చిన పలు అర్జీలను మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇవ్వడం జరిగింది. అలాగే చట్టబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో మంత్రి సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి ఆయా సమస్యలకు పరిష్కరించడం జరిగింది.

భార్యపై అనుమానంతో వేట కొడవలితో దాడి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని కంబదహాళ్ గ్రామానికి చెందిన జయంతిపై అనుమానంతో భర్త వేమారెడ్డి శుక్రవారం వేట కొడవలితో దాడి చేశాడు. అడ్డొచ్చిన అత్త జయమ్మపై దాడి చేసి తీవ్రంగా గాయపరచాడు. జయంతిని ఆలూరు మండలంలోని అంగస్కల్ గ్రామానికి చెందిన వేమారెడ్డితో 16 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే వీరి సంసార జీవితంలో మనస్పర్థలు ఏర్పడి గొడవలు మొదలయ్యాయి. జయంతి కొన్ని రోజులుగా పుట్టినిల్లు కంబదహాళ్ లోనే ఉంటుంది. బెంగళూరుకు వలసకు వెళ్లి వచ్చిన వేమారెడ్డి భార్య జయంతిపై అనుమానం మరింత పెంచుకొని వేట కొడవలితో నిర్దాక్షిణ్యంగా దాడి చేశాడు. కూతురుపై దాడిని అడ్డుకొనేందుకు ప్రయత్నించిన అత్త జయమ్మపై కూడా దాడి చేశాడు. రక్తపు మడుగులో పడి ఉన్న జయంతి, జయమ్మలను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. జయంతి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు కర్నూలు ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఈ ఘటనపై ఎస్ఐ నిరంజన్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్యవైశ్య సంఘం ఎన్నికలలో గోల్ మాల్

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్: పట్టణంలో ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ జక్క గురు ప్రసాద్ తమ స్వగృహంలో శుక్రవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు ఆర్యవైశ్య సంఘం మహిళా మండలి ఎన్నికలలో దారుణం చోటు చేసుకుందని, ఆర్యవైశ్య సంఘంలో కొందరు పెద్ద మనుషులుగా చలామణి అవుతూ శుక్రవారం నాటి ఆర్యవైశ్య మహిళా మండలి ఎన్నికల్లో పోలింగ్ జరగనీయకుండా తమ బంధువైన ఒక మహిళను ఏకగ్రీవంగా అధ్యక్షకురాలిగా ప్రకటించి, నిరంకుశ ధోరణి అవలంబించారని, ఆర్యవైశ్య వర్గంలో తీవ్ర వ్యతిరేకత ఉందని, ప్రశ్నించే వారిని సైతం పదవుల నుంచి తొలగించే కుట్రకు తెర లేపుతున్నారని తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు.

స్వర్ణోత్సవ వేడుకలో మహాకుంభాభిషేకం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పట్టణం సంజీవ నగర్ లోని రామాలయం లో స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా మహాకుంభాభిషేకం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. శ్రీ భగవత్ సేవా సమాజ్ వారి ఆధ్వర్యంలో సిద్ధి బుద్ధి సమేత మహాగణపతి చలప్రతిష్ఠ, 1236 కళాశాలతో సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న అన్ని ప్రధాన ఆలయాలు, ఉప ఆలయాలు, పరివార దేవతలకు, 14 శిఖర కళాశాలకు శ్రీశ్రీశ్రీ పుష్పగిరి పీఠాధిపతి జగద్గురు శ్రీ విద్యాశంకర భారతి మహాస్వామి వారు స్వయంగా అభిషేకం నిర్వహించారు. ఈ రోజు జరిగిన మరో ముఖ్య ఘట్టం రాజగోపురం శిఖర కళాశాలకు మహాస్వామి వారు అభిషేకం చేసిన వెంటనే పై నుంచి ప్రోక్షించిన వెనువెంటనే వరుణ దేవుడు తుంపర్ల వర్షంతో అందరినీ అలరించారు. వెను వెంటనే భక్తులు అందరూభావోద్వేగానికి లోనయ్యారు. పాలకవర్గ సభ్యులు మహా స్వామి చేత దర్శనానికి వచ్చిన ప్రతి భక్తునికి ఆశీర్వాదం, ఫలం ఇప్పించారు. వచ్చిన అందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.